నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 16 అక్టోబర్ 2024 | PEDDAPALLI

కరీంనగర్: డీఈవో జనార్దన్ నుంచి పోస్టింగ్ లెటర్ అందుకుంటున్న అభ్యర్థి

నేడు విధుల్లోకి కొత్త టీచర్లు

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 15 : : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం కౌన్సెలింగ్ పూర్తి చేసుకున్న డీఎస్సీ-2024 అభ్యర్థులు బుధవారం నుంచి ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు. జగిత్యాల జిల్లాలో 100 మంది స్కూల్ అసిస్టెంట్స్, 134 మంది ఎస్‌జీటీలు, ఏడుగురు పీఈటీలు, 31 మంది ఎల్‌పీల చొప్పున మొత్తం 272 మంది, పెద్దపల్లి జిల్లాలో 73 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 132 మంది, కరీంనగర్ జిల్లాలో 215 మందికి మంగళవారం ఆయా జిల్లా కేంద్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పోస్టింగ్‌లు కేటాయించారు. వీరంతా నేటి నుంచి ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో విధుల్లో చేరాలని అధికారులు ఆదేశించారు.

ఏరియా దవాఖానలో బాలింతను బాగోగులు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

రోగులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరిక

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 15 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే పేద రోగుల విషయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం హుజూరాబాద్ ఏరియా దవాఖానలో గర్భిణులకు ఆపరేషన్లు ఆలస్యంగా జరగడంపై ఆయన స్పందించారు. మంగళవారం దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం గర్భిణులకు వైద్యులు డెలివరీ ఆలస్యం చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన కేసీఆర్ కిట్‌కు పేరు మార్చయినా ఇవ్వాలని, జనాలకు మేలు చేసే పథకాలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారు హయాంలో ప్రభుత్వ దవాఖానల్లో వైద్యం పూర్తిస్థాయిలో అందేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఆ స్థాయిలో చికిత్స అందడం లేదన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే దున్నపోతుపై వర్షం పడినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఇక్కడ నెలకు 200కు పైగా డెలివరీలు జరిగేవని, ప్రస్తుతం ఆస్థాయి గణనీయంగా పడిపోయిందన్నారు. హుజూరాబాద్ దవాఖానకు ఒక గైనకాలజిస్ట్‌తో పాటు అనస్తీషియా వైద్యుడిని వెంటనే కేటాయించాలని, అలాగే, జమ్మికుంటకు కూడా గైనకాలజిస్టును నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సూపరింటెండెంట్ రాజారెడ్డి, ఆర్ఎంవో సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న యజమాని రాకేశ్, తదితరులు

గురుకుల కళాశాలకు తాళం

ఎనిమిది నెలలుగా భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని నిరసన

వేములవాడ, అక్టోబర్ 15: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి అద్దె చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆ భవనానికి యజమాని తాళం వేశాడు. వేములవాడ పట్టణంలోని భవానీనగర్‌లో కొనసాగుతున్న బోయినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి సంబంధించి ఎనిమిది నెలలుగా కిరాయి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారంటూ యజమాని రాకేశ్ నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా భవనానికి తాళం వేయడంతో ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి చేరుకొని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, దసరా సెలవుల తర్వాత కళాశాల తెరుస్తున్నందున విద్యార్థులు వస్తారని, సహకరించాలని కోరడంతో తాళం తీశాడు. దీంతో కళాశాల యథావిధిగా కొనసాగింది.

ఫైర్‌సేఫ్టీ సిబ్బందికి శిక్షణ ప్రారంభం

శిక్షణలో ఫైర్ సేఫ్టీ సిబ్బంది

రాంనగర్, అక్టోబర్ 15 : రిమోట్ సెన్సింగ్ ఏరియా, వరద ప్రభావిత ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఫైర్ సేఫ్టీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కరీంనగర్‌లో మంగళవారం ప్రారంభించారు. నగర శివారులోని లోయర్ మానేరు డ్యాంలో మూడు జోన్ల పరిధిలోని 8 జిల్లాలకు చెందిన 70 మంది సిబ్బందికి శిక్షణ మొదలు పెట్టారు. ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, సిబ్బంది ప్రవర్తించే విధానంపై మెళకువలు నేర్పించారు. కరీంనగర్ జిల్లా ఫైర్ అధికారి ఎన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ శిక్షణలో మంచిర్యాల డీఎఫ్‌వో భగవాన్‌రెడ్డి, సిరిసిల్ల, మానకొండూర్ ఫైర్ అధికారులు నరేందర్, భూదయ్య, కరీంనగర్ ఇన్‌చార్జి గుండయ్య పాల్గొన్నారు.

భూమి గుణం తెలుసుకొని సాగితేనే రైతుకు మేలు

నేలసారం.. పంటకు ప్రాణం

భూమి గుణం, దాని సారం తెలుసుకొని పంటలు సాగు చేసినప్పుడే రైతన్న పంట పండుతుంది. మంచి దిగుబడి వచ్చి, లాభాల బాట పట్టే అవకాశముంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రెండు సీజన్లలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి పండిస్తుండగా, ఇతర పంటల సాగు తగ్గిపోయింది. రైతులందరూ ధాన్యం పండిస్తుండడంతో క్రమంగా మార్కెట్‌లో డిమాండ్ కూడా తగ్గిపోగా, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని దశాబ్దాలుగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న మృత్తికల రకాలు, పండే పంటలు, ఆచరించాల్సిన పద్ధతులపై 'నమస్తే' ప్రత్యేక కథనం..

- మృత్తికలు.. సేద్యానికి మాతృకలు
- ఉమ్మడి కరీంనగర్‌లో ఎర్రనేలలే అధికం
- రెండో స్థానంలో నల్లరేగడి నేలలు
- ఒకే రకం పంటలతో అంతంతే ప్రయోజనం
- ఇతర పంటలతో లాభదాయకం

జగిత్యాల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తీరొక్క నేలలు కనిపిస్తాయి.. ఒక్కోచోట ఒక్కో రకం భూములు ఉన్నాయి.. గోదావరి తీర ప్రాంతంలో ఒండ్రు నేలలు అధికంగా ఉంటే.. మైదాన ప్రాంతాల్లో ఎర్ర, నల్లరేగడి భూములు అధికంగా ఉన్నాయి.. మరికొన్ని చోట్ల సొడు భూములు కనిపిస్తాయి. అయితే ఉమ్మడి జిల్లాలో 70 శాతం ఎర్ర, నల్లరేగడి నేలలు, 20 శాతం సున్నపు నేలలు, మరో 10 శాతం ఇతర రకాలు ఉన్నాయి. మొత్తంగా 93 శాతం భూమిలో నత్రజని లోపం కనిపిస్తున్నది. 80 శాతం పాస్పరస్, 78 శాతం పొటాషియం అధికంగా ఉన్నది. నీటి సౌలత్ అధికంగా ఉండడంతో రైతులు వరి సేద్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ఈ నేలల్లో వరి ఒక్కటే కాదు ఆరుతడి పంటలు పుష్కలంగా పండుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు, భూసారం ఆధారంగా పంటలు వేస్తే మేలైన దిగుబడులు వస్తాయని, రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

ఎర్రనేలల లక్షణాలు

ఎర్రనేలలు అంతగా సారవంతమైనవికావు. తేలికగా ఉండి, గాలిపారాడేట్లు ఉంటాయి. పౌష్టిక, సేంద్రియ పదార్థాలు తక్కువగా, భాస్వరం అధికంగా ఉంటుంది. ఐరన్ ఆక్సైడ్‌ను కలిగి ఉండడం వల్ల ఎరుపు రంగులో కనిపిస్తాయి. ఈ నేలల్లో ప్రధానంగా జొన్న, సజ్జ, పల్లి, ఆముదాల సాగుకు అనుకూలం. అయితే ఉమ్మడి జిల్లాకు గోదావరి నీటిని మళ్లించడం, 24 గంటల విద్యుత్ అందుబాటులోకి రావడం, ఇప్పటికే ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు అందుబాటులో ఉండడంతో పుష్కలమైన నీటి వసతి ఏర్పడింది. దీంతో వరినే అధికంగా పండిస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ఎర్రనేలల్లో ఆరుతడి పంటలను పండించాల్సిన అవసరం ఉందని పొలాస శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో పల్లి, ఆముదం, పొద్దుతిరుగుడు, కంది, పెసర, మినుము, అలసంద, జొన్న, మక్క, కుసుమ పంటలు, వర్షాధారితమైన ఎర్రనేలల్లో ఉలువలు, జొన్నలు వేయాలని సూచిస్తున్నారు.



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో సేద్యంకు సిద్ధం చేసిన భూమి

నల్లరేగడి నేలలు

అర్థ శుష్క పరిస్థితులు ఉండే దక్కన్ పీఠభూమిలో బస్టాల్ శిలల శైథిల్యంతో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి. మెత్తని ఇసుప పదార్థాలు ఉండడం వల్ల నల్లగా కనిపిస్తాయి. వీటిని చెర్నోజెమ్, రేగూర్‌గా పిలుస్తుంటారు. ఈ రకం భూములు నీటిని గ్రహించి ఎక్కువ కాలం నిల్వ చేసుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. వీటిలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, కార్బొనేట్, అల్యూమినియం పుష్కలంగా, నత్రజని, పాస్పారిక్ ఆమ్లం, సేంద్రియ పదార్థం తక్కువ మోతాదులో ఉంటాయి. పత్తి పంటకు అత్యంత అనుకూలమైనవి. అందుకే వీటిని బ్లాక్ కాటన్ సాయిల్స్‌గా పేర్కొంటారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో అత్యధికంగా విస్తరించి ఉన్నాయి. పత్తే కాకుండా మిర్చి, పొగాకు, పసుపు లాంటి పంటలు వేయవచ్చు. నీటి సౌకర్యం ఉన్న నల్లరేగడి నేలల్లో ఆముదం, పొద్దు తిరుగుడు, మక్క, పెసర, మినుము, ఉలువలు, జొన్నలు, వర్షాధారిత నల్లరేగడి నేలల్లో శనగ, కుసుమ, ఆవాలు సాగు చేసుకోవచ్చు.

ఒండ్రు నేలలు

సహజసిద్ధంగా ఏర్పడిన సారవంతమైన నేలలను ఒండ్రు నేలలు అంటారు. తెలంగాణలో ఒండ్రునేలల శాతం తక్కువగానే ఉన్నప్పటికీ మూడో స్థానంలో ఒండ్రునేలలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మాత్రం పెద్ద విస్తీర్ణంలో లేవనే చెప్పాలి. నదులు అనేక సంవత్సరాలుగా ప్రవాహంలో తీసుకువచ్చిన ఒండ్రుమట్టిని నిక్షేపం చేయడం వల్ల ఒండ్రు నేలలు ఏర్పడుతాయి. ఇవి నీటిని నిలువ చేసుకునే లక్షణాన్ని కలిగి ఉన్నాయి. అత్యంత సారవంతమైన నేలలుగా ఇవి గుర్తింపు పొందాయి. ఈ నేలల్లో పోటాషియం ఎక్కువగా ఉండి, నైట్రోజన్, పాస్ఫరస్‌లు తక్కువగా ఉంటాయి. వరి, చెరుకు, అరటి సాగుకు అనుకూలం. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో దాదాపు మూడు వేల ఎకరాల చొప్పున, కరీంనగర్ జిల్లాలో 29వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి.

కరీంనగర్ జిల్లాలో నేలల రకాలు

కరీంనగర్ జిల్లాలో 1.25 లక్షల హెక్టార్ల సేద్యానికి అనుకూలమైన భూమి ఉన్నది. జిల్లాలో పెద్ద మొత్తంలో లోతైన సున్నపు నల్లనేలలు (44.2 శాతం) విస్తరించి ఉన్నాయి. కరీంనగర్ పరిధిలో ఒండ్రు మట్టినేలలు 13.8 శాతం, ఎరుపు కంకర మట్టి నేలలు 13.1 శాతం, ఎర్ర బంక మట్టి నేలలు 13.1 శాతం ఉన్నాయి. జిల్లాలో 93,841 ఎకరాల్లో సున్నపు నల్లనేలలు ఉన్నాయి. మానేరు తీరం వెంట 29,265 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఇక ఎరుపు కంకర మట్టి నేలలు 27,771 ఎకరాలు, ఎర్ర బంకమట్టి నేలలు 27,775 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి

సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల జిల్లాలో లక్ష హెక్టార్ల భూమి సేద్యానికి అనుకూలమైంది. జిల్లాలో పెద్ద మొత్తంలో లోతైన సున్నపు నల్లనేలలు విస్తరించి ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 21.13 శాతం ఎర్రబంక నేలలు ఉన్నాయి. ఎరుపు నిస్సార నేలలు 16.38 శాతం, సున్నపు నల్ల నేలలు 10.69 శాతం, ఎర్రబంక మట్టి నేలలు 11.67 శాతం ఉన్నాయి. ఒండ్రునేలలు లేవు. ఎర్ర బంక నేలలు 51,483 ఎకరాల్లో, ఎరుపు నిస్సార నేలలు 31,086 ఎకరాల్లో, సున్నపు నల్లరేగడి నేలలు 20,289 ఎకరాల్లో, ఎర్రబంక మట్టినేలలు 22,144 ఎకరాల్లో ఉన్నాయి.

జగిత్యాల జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల సేద్యపు జిల్లాగా ప్రసిద్ధిగాంచింది. అయితే మిగిలిన జిల్లాలతో పోల్చిచూస్తే జగిత్యాలలో భూములు పూర్తిగా సారవంతమైన భూములు కావని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు 1.30 లక్షల హెక్టార్ల సేద్యభూమి ఉన్నది. ఎర్రబంక మట్టి నేలలే (46.5 శాతం)అధికంగా విస్తరించి ఉన్నాయి. ఎరుపు నిస్సార లోమ్ భూములు 10.9 శాతం, లోతైన నల్లనేలలు 8 శాతం, మధ్యస్థ నల్లనేలలు 7.1 శాతం ఉన్నాయి. సారవంతమైన ఒండ్రు నేలలు కేవలం 0.9 శాతం మాత్రమే. అది కూడా గోదావరినది ప్రవాహం ప్రారంభమయ్యే ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో ఉన్నాయి. జిల్లాలో మొత్తంగా 1,32,627 ఎకరాల్లో ఎర్రబంకమట్టి నేలలు, 31,104 ఎకరాల్లో ఎరుపు లోమ్ నేలలు, లోతైన నల్లరేగడి నేలలు 22,745 ఎకరాలు, మధ్యస్థ నల్లనేలలు 20,260 ఎకరాల్లో ఉన్నాయి. కేవలం 2,621 ఎకరాలు మాత్రమే ఒండ్రు నేలలు.

పెద్దపల్లి జిల్లాలో..

పెద్దపల్లి జిల్లాలోను సేద్యానికి పెద్దగా అనుకూలమైన సారవంతమైన భూములు లేవు. 1.20 లక్షల హెక్టార్లు సేద్యానికి అనుకూలంగా ఉంది. జిల్లాలో లోతైన సున్నపు నల్లనేలలు 39.4 శాతం విస్తరించి ఉన్నాయి. మధ్యస్థ సున్నపు నల్లనేలలు 13.9 శాతం, ఎరుపు నిస్సారమైన లోమ్ నేలలు 6.7, ఎర్రబంక మట్టినేలలు 6.7శాతం, ఎరుపు కంకర మట్టినేలలు 6శాతంలో విస్తరించి ఉన్నాయి. ఇక ఒండ్రునేలలు 9 శాతం విస్తరించి ఉన్నాయి. గోదావరినది పరివాహక ప్రాంతాల్లో ఈ ఒండ్రు మట్టినేలలు విస్తరించి ఉన్నాయి.

తలనీలాల కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు

- ఐదు నెలలుగా రాజన్న ఆలయానికి బకాయిలు
- ₹4కోట్ల విలువైన చెక్కుల బౌన్స్ • కోర్టు మెట్లెక్కిన ఆలయ అధికారులు • వచ్చే నెల 13న హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశం

వేములవాడ, అక్టోబర్ 15: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌పై న్యాయస్థానంలో క్రిమినల్ కేసు నమోదైంది. 2023-25 రెండేండ్లకుగాను తలనీలాల సేకరణకు ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురానికి చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు నాగరాజు ₹19కోట్లకు టెండర్ దక్కించుకున్న విషయం తెలిసిందే. మొదట ₹50 లక్షలు డిపాజిట్ చేసి, ప్రతి నెలా ₹79,17,000 చెల్లించేందుకు 24 చెక్కులను ఆలయ అధికారులకు అందజేశాడు. ఏప్రిల్ 2024 వరకు ₹8కోట్ల 92లక్షల 4500 చెక్కుల ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఆ మరుసటి నెల నుంచి వేసిన రెండు చెక్కులు బ్యాంకులో బౌన్స్ కాగా, అప్పటి నుంచి కాంట్రాక్టర్‌కు తలనీలాల సరఫరాను నిలిపేసి, అధికారులే భద్రపరుస్తున్నారు. చెక్కులు బౌన్స్ కావడంతో న్యాయవాది ద్వారా కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపగా, ఆయన ఏ మాత్రం స్పందించలేదు. దీంతో అధికారులు ఈ నెల 9న వేములవాడ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, సదరు కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా వచ్చే నెల 13న హాజరు కావాలని కోర్టు ఆదేశించిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సదరు కాంట్రాక్టర్ కొద్దిరోజుల క్రితం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి అంతర్జాతీయంగా ధర లేనందున నష్టం వాటిల్లుతున్నదని, ఇప్పటివరకు సేకరించిన తలనీలాలు తనకు ఇవ్వాలని వినతి పత్రం అందజేయగా, అందులో ఎలాంటి వెసులుబాటు లేదని కమిషనర్ సమాధానం ఇచ్చారు. అయితే పై రెండు చెక్కులే కాదు గడిచిన మూడు నెలలుగా మరో మూడు చెక్కులు బౌన్స్ అయ్యాయని, మొత్తం బకాయిలు ₹4 కోట్లకు చేరిన నేపథ్యంలో మరో కేసు కూడా వేస్తామని, న్యాయస్థానం ద్వారా స్వామి వారికి రావాల్సిన ఆదాయాన్ని సాధిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంకా ఆలయంలో ఐదు నెలలుగా నిల్వ ఉన్న తలనీలాలను విక్రయించేందుకు చర్యల నిమిత్తం అనుమతులు ఇవ్వాలని కమిషనర్‌ను లేఖ రాసినట్టు పేర్కొంటున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించాం

రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణ కాంట్రాక్టర్ ఆలయానికి నగదు చెల్లించడం లేదు. గతంలోనే రెండు చెక్కులు బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాం. కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు నమోదైంది. ఇటీవల కాలంలో మరో మూడు చెక్కులూ బౌన్స్ అయ్యాయి. పూర్తి బకాయిలను న్యాయస్థానం ద్వారా రాబడతాం. ఆలయంలో నిల్వ ఉన్న తలనీలాలను విక్రయానికి అనుమతులు ఇవ్వాలని కమిషనర్‌ను కోరుతున్నాం. **- వినోద్ రెడ్డి, ఈవో (రాజన్న ఆలయం)**

రోడ్డు వేస్తేనే దూరం తగ్గేది

ముత్తారం-ఎరడపల్లి దారి దుస్థితి

- ప్రభుత్వం మారడంతో పట్టింపు కరువు
- ముత్తారం నుంచి ఎరడపల్లి మధ్య తిప్పలు

శంకరపట్నం, అక్టోబర్ 15: శంకరపట్నం మండలంలోని ముత్తారం నుంచి ఎరడపల్లి మధ్య కేవలం మూడు కిలోమీటర్ల దూరమే అయినా.. రోడ్డు సరిగా లేక ఏడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది. రెండు గ్రామాల మధ్య ఉన్న దారిలో ముత్తారం రామసముద్రం చెరువు మత్తడి వాగు, మరి కొద్ది దూరంలో ఎరడపల్లి వాగు అడ్డుగా ఉంటాయి. అయితే, 2018లో బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఎరడపల్లి సర్పంచ్ కలకుంట్ల సాగర్‌రావు అప్పటి ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బీ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, దీనిని బీటీ రోడ్డుగా మార్చేందుకు పూనుకున్నారు. మొదట ₹85 లక్షల నిధులతో రామసముద్రం చెరువు మత్తడి వాగుపై వంతెన నిర్మించారు. తిరిగి, 2022లో ₹4 కోట్ల 25 లక్షలతో ఎరడపల్లి మత్తడి వాగుపై వంతెన నిర్మించారు. అయితే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం రావడం.. దీనిపై దృష్టిసారించే వారు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం రైతులు తమ పొలాల వద్దకు వెళ్లాలన్నా అనువుగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు వేస్తే ముత్తారంతో పాటు కన్నాపూర్, ధర్మారం, కాచాపూర్, రాజాపూర్, గద్దపాక, తదితర గ్రామాల ప్రయాణికులకు ఎరడపల్లి మీదుగా గంగిపల్లి, చెంజర్ల, కరీంనగర్‌కు, అలాగే తాడికల్ వెళ్లేందుకు సౌలభ్యంగా మారుతుంది. అంతే కాకుండా రానూ పోనూ కలిపి 14 కిలోమీటర్లకు పైగా దూర భారం తగ్గుతుంది.

ఉద్యోగం రాలేదని..

మానేరులో దూకి వివాహిత ఆత్మహత్య

వేములవాడ రూరల్, అక్టోబర్ 15 : ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఓ వివాహిత ప్రాణం తీసుకున్నది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన నక్క దివ్య (33) ఇటీవల డీఎస్సీ పరీక్ష రాసింది. అయితే.. ఉద్యోగం రాకపోవడం, గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకోగా అవి విడాకులకు దారి తీయడం.. వీటిని దృష్టిలో పెట్టుకొని ఉదయం ఇంటి నుంచి వచ్చి ఆరెపల్లి గ్రామ శివారు మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మృతదేహం తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండగట్టు ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

నిత్యాన్నదాన సత్రం బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఫలితం

మల్యాల, అక్టోబర్ 15: కొండగట్టు అంజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రం జూనియర్ అసిస్టెంట్ కూరగాయల రాములును సస్పెండ్ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు తెలిపారు. నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన 50 కేజీల బియ్యం, ఇతరత్రా సరుకులను పక్కదారి పట్టించాడని ఆరోపణలపై విచారణ చేశామని చెప్పారు. సీసీ కెమెరాలు పరిశీలించడంతోపాటు బియ్యాన్ని తరలించిన ఓ గ్యాస్ ఏజెన్సీకి చెందిన డెలివరీ బాయ్ సురేశ్ స్టేట్‌మెంట్‌ను తీసుకున్నామని, పక్కదారి పట్టించింది నిజమేనన్న పూర్తి ఆధారాలు దొరకడంతో రాములును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం చెప్పారు. అలాగే నిత్యాన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలను ఆలయ జూనియర్ అసిస్టెంట్ ధర్మేందర్‌కు అప్పగించినట్లు తెలిపారు.